అడుగేయాలంటే అవస్థలే...



నరజాములతండాలో రహదారిపై నిలిచిన నీరు



రహదారి అంతా బురదమయం

- డ్రైనేజీలు, రహదారులు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులు

పుల్లలచెరువు: మండల పరిధిలోని మాచర్ల–హైదరాబాద్ మధ్య రహదారిలో ఉన్న నరజాములతండాలో అన్నీ సమస్యలే. తండాలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అక్కడ దాదాపు 200 కుటుంబాలు నివశిస్తున్నాయి. వర్షం పడినప్పుడు తండాలో చాలా రహదారులు గుంతలు పడి బురదమయవడంతో వృద్ధులు, మహిళలు, పాఠశాలల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తండాలో డ్రైనేజీలు కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. జిల్లాకు చివర ఉండడంతో అధికారుల పర్యవేక్షణ లేక సమస్యల గురించి పట్టించుకునే వారు కరువయ్యారని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాలో రహదారులు, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైతులకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం

తాళ్లూరు: రైతులకు ఖరీఫ్ సీజన్లో పంటసాగుకు యూరియా అందించకుండా కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ షేక్ వలి మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు తాళ్లూరు మండలం రజానగరం గ్రామంలో సోమవారం బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలు చేయకుండా కూటమి పాలకులు విజయోత్సవ సభలు నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలోకం హరిబాబు, నియోజకవర్గ ప్రచార, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు యత్తపు మధుసూదన్‌రెడ్డి, జక్కుల రామకృష్ణ, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు షేక్ లతీఫ్ (బచ్చా), నాగుళ్ల వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు చిమట సుబ్బారావు, ఖాలేషావలి, ఎంపీటీసీ సభ్యులు మేడగం వెంకట్రామిరెడ్డి, షేక్ ఖాదర్‌బాషా, అనపర్తి అంకయ్య, పులి వికాస్, ఉపసర్పంచ్‌లు వీరమాసు రామయ్య, లక్కం పెద్దిరెడ్డి, మేడగం చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు కటకంశెట్టి శ్రీనివాసరావు, పూనూరి దేవదానం, గోపు శ్రీనివాసరెడ్డి, యానం గోపికృష్ణ, కైపు కోటిరెడ్డి, మారం నాగిరెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలపై క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న నాయకులు

క్లుప్తంగా

నిత్యావసరాలు అందించిన ఎంఈఓ

త్రిపురాంతకం: కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో చదువుతున్న దత్తత తీసుకున్న విద్యార్థినులకు అవసరమైన నిత్యవసర వస్తువులను ఎంఈఓ 2 టీ రాజశేఖరరెడ్డి అందించారు. త్రిపురాంతకం కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు ఇద్దరిని పీ 4 కింద ఎంఈఓ రాజశేఖరరెడ్డి దత్తత తీసుకున్నారు. విద్యార్థినుల అవసరాలు తీరుస్తానని అప్పట్లో హామీ ఇచ్చారు. విద్యార్థినులకు అవసరమైన నిత్యవసరాలను వారికి అందించారు.

జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన విద్యార్థిని



త్రిపురాంతకం జెడ్పీ విద్యార్థినిని అభినందిస్తున్న అధికారులు

త్రిపురాంతకం: త్రిపురాంతకం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రకాశం జిల్లా మైనంపాడు డైట్ కళాశాలలో నిర్వహించిన కళా ఉత్సవంలో విజేతగా నిలిచింది. విద్యార్థినిని అధికారులు అభినందించారు. జెడ్పీ పాఠశాలకు చెందిన బొందలపాటి శైలజ సోలో సింగింగ్‌లో జిల్లా స్థాయిలో రెండో స్థానంతో విజయం సాధించింది. విద్యార్థిని శైలజను ఎంఈఓ తులసి మల్లికార్జున నాయక్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉడుముల శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



త్రిపురాంతకం జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

త్రిపురాంతకం: రాష్ట్రీయ హిందీ భాషా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన హిందీ భాషా ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు గోప వనిత మాట్లాడుతూ దేశంలో హిందీ భాషకు ప్రాధాన్యత ఉందన్నారు. దక్షిణ భారత ప్రచార సభ నిర్వహించే పరీక్షల వివరాలు తెలిపారు. హిందీలో నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని వివరించారు. విద్యార్థులలో దేశంపట్ల జాతీయ భావాలు పెరుగుతాయన్నారు. హిందీ ఉపాధ్యాయురాలు ఎం రోజీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

దర్శి: స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ అధికారి కాశీ చేతన్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసచారి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని అన్నారు. వ్యాధులు వచ్చినప్పుడు ఇతరులకు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి అర్థమయ్యేలా చెప్పారు. అంటువ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయో వివరించారు. విద్యార్థులు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మీరాసాహెబ్, వైస్ ప్రిన్సిపాల్ కమలాకర్, ఇన్నయ్య, కుమార్, ఆరోగ్య కార్యకర్తలు సుహాసిని, పార్వతి, మాధవీలత, నారాయణమ్మ, శివపార్వతి, తిరుమలమ్మ, సుశీల పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి



తిరుమలలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, నాయకులు

యర్రగొండపాలెం: తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం దర్శించుకున్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రైతులు పాడిపంటలతో కళకళ లాడాలని, నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఏపీ ఇరిగేషన్ మాజీ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, పెద్దదోర్నాల మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకటరమణారెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా ఎల్లేష్ యాదవ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వల్లభనేని పవన్‌కుమార్ ఉన్నారు.

పలు పాఠశాలల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జగన్నాథరావు

కురిచేడు: మండలంలోని పలు పాఠశాలలను డైట్, మైనంపాడు అధ్యాపకుడు, జిల్లా పరిశీలకుడు ఆర్. జగన్నాథరావు సోమవారం తనిఖీ చేశారు. బోధనంపాడు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, మోడల్ ప్రైమరీ పాఠశాల, అలవలపాడు గ్రామంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల, కురిచేడులోని ఎంపీపీఎస్ స్పెషల్ పాఠశాల, భవిత సెంటర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, విద్యార్థుల సంఖ్య, హాజరు, విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు, బోధనోపకరణాల వినియోగం, టీచర్ హ్యాండ్ బుక్, విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. ఎస్ఏ–1కు సంబంధించిన సిలబస్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ఉపయోగం గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కోరారు. గైర్హాజరుపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఎఫ్ఏ–1 మార్కులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పరిశీలకులతో పాటు ఎంఈఓ–2 సీహెచ్ సుబ్బారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, దస్తగిరి, విజయకుమార్ పాల్గొన్నారు. విద్యార్థుల నమోదు తక్కువగా ఉన్న పాఠశాలల తల్లిదండ్రులతో సమావేశమై ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదలకు కృషి చేయాలని, ఎలిమెంటరీ విద్య పునాది అని, అందువలన ప్రత్యేక శ్రద్ధ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

దర్శి: ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరసన వారం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐదో రోజు దర్శి తాలూకా స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. దర్శి జోన్‌లోని ఐదు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దర్శి జోన్ కన్వీనర్ ప్రసాద్ అధ్యక్షతన పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో అమలు చేస్తున్న అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని, నూతన అసెస్మెంట్, సీపీఎస్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలు మంజూరు చేయాలన్నారు. ఐఆర్ ప్రకటించాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తూము శ్రీనివాసరావు, నక్క కోటేశ్వరరావు, ముండ్లమూరు మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కురిచేడు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ వెంకటస్వామి, కాజా రహమతుల్లా, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్‌కే మస్తాన్‌వలి, చక్రధర్, వేమా రమణయ్య, నజీరు, భోగిరెడ్డి శ్రీను, గోవిందు, రాజశేఖర్‌రెడ్డి, బీవీ నారాయణ, అమర శ్రీనివాసులు, పీవీ నారాయణ, నాదెండ్ల శ్రీను, ఐవీఎల్ నారాయణ, సందు వెంకటేశ్వర్లు, సాంబయ్య, కంట శ్రీను, హరి ప్రసాదు, ముత్యాల శ్రీను, మహిళా ఉపాధ్యాయులు మంజుల, సులోచన, అనిత, కోటేశ్వరమ్మ, శ్రీదేవి, షాహినా బేగం, ఈశ్వరమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



శివాలయంలో అభిషేకం నిర్వహిస్తున్న ఆలయ పూజారి భరద్వాజ్

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల శ్రీ భవానిశంకర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సోమవారం నిర్వహించే పూజ కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

పొలాల్లో పొడవు ముక్కు కాకి..!



పొడవు ముక్కుతో పొలంలో ఉన్న కాకి

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామ పొలాల్లో సోమవారం పొడవు ముక్కుతో ఓ కాకి కనిపించింది. ఆ గ్రామానికి చెందిన గాలేటి ఆదిలక్ష్మి, బల్లాని సుజాతలు తమ కుమారులతో కలిసి వరి పంట సాగు కోసం పొలం బాగుచేస్తున్నారు. ఆ సమయంలో పురుగులు తినేందుకు పలు రకాల పక్షులతో పాటు ఓ కాకి కూడా వచ్చింది. ఆ కాకికి పొడవు ముక్కు ఉండటంతో రైతులంతా ఆసక్తిగా తిలకించారు. అంత పొడవు ముక్కుతో ఆ కాకి ఆహారం ఎలా తీసుకుంటుందోనని గమనించారు.

మాదిగలకు శ్మశాన వాటిక కేటాయించాలి



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కురిచేడు: మండలంలోని పెద్దవరం గ్రామంలో మాదిగలకు శ్మశాన వాటిక కేటాయించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు మాగులూరి రామయ్య మాదిగ సోమవారం మండల తహసీల్దార్ జి.రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో మాదిగలు చనిపోతే ఖననం చేయడానికి సరైన తావులేక కొందరు తమ నివాస ప్రాంతాల్లోనే అంత్యక్రియలు ముగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉండటానికే స్థలం లేని నిరుపేదలు కాలువ గట్టులపై కూడా ఖననం చేస్తున్నారన్నారు. ఎస్సీలకు గతంలో శ్మశానం ఉండేదని, కానీ, కొందరు ఆక్రమించారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎస్సీలకు తక్షణమే ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ ద్వారా అయినా శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. లేకుంటే పెద్దవరం మాదిగలతో ఒంగోలు కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి యోగేశ్వరరావు మాదిగ, కురిచేడు మండల అధ్యక్షుడు కంభంపాటి జోసెఫ్ మాదిగ, టౌను ఎంఎస్పీ నాయకుడు కంభంపాటి సాయన్న మాదిగ, నాయకులు డి.రామయ్య మాదిగ, పెద్దవరం గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యపానంపై దాడులు



మందుబాబులతో మాట్లాడుతున్న ఎస్సై

తాళ్లూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. తాళ్లూరు ఎస్సై మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి తాళ్లూరులో దాడులు చేసి మందుబాబులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. కానిస్టేబుల్ శ్రీను, వాసు పాల్గొన్నారు.

మల్లంపేటలో పిచ్చికుక్కల స్వైర విహారం



పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారి

దొనకొండ (కురిచేడు): దొనకొండ మండలంలోని మల్లంపేట పంచాయతీలో పిచ్చికుక్కల స్వైరవిహారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారి, గ్రామ సర్పంచ్‌లకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ చింతకుంట్ల నాగార్జున, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కాలు రామయ్య పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతకుంట్ల రిత్విక్ అనే చిన్నారిని సోమవారం పిచ్చి కుక్క కరవటంతో గ్రామ ప్రజలు, ఎస్సీకాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి పిచ్చికుక్కలను పట్టించి ప్రజలను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.